ఈనాడు ఆదిలాబాద్

బుధవారం అక్టోబరు 16, 2024 5

పోలీసు పహారా నడుమ
డీఎస్సీ కౌన్సెలింగ్


డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయించిన అభ్యర్థులు, ఉపాధ్యాయ, బీసీ సంఘనాయకులు

- ఉద్రిక్తతకు దారితీసిన ఆందోళన
- పోస్టింగ్ రోజు అభ్యర్థులకు తప్పని అవస్థలు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : మంగళవారం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు డీఈవో కార్యాలయానికి రావాలని పిలుపు రావడంతో డీఎస్సీ-2024 ఎంపికైన అభ్యర్థులంతా సంతోషంగా తరలివచ్చారు. వచ్చి రాగానే కౌన్సెలింగ్ రద్దయ్యిందని సంతకాలు చేసి వెళ్లిపోవాలని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. అలా వెళ్లారో లేదో.. మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని మళ్లీ పిలుపు వచ్చింది. వ్యయప్రయాసల కోర్చి వచ్చిన అభ్యర్థులకు సాయంత్రం వరకు ఏం జరుగుతుందో తెలియలేదు. ఎంపిక జాబితాలో పొరపాట్లను సవరించకుండా కౌన్సెలింగ్ ఎలా నిర్వహిస్తారంటూ బాధిత అభ్యర్థుల ఆందోళనకు దిగడంతో ప్రతిష్టంభన నెలకొంది. బాధిత అభ్యర్థులకు ఉపాధ్యాయ, కుల సంఘాల నాయకులు మద్దతు తెలపడంతో గందరగోళానికి తోడు ఉద్రిక్తతకు దారితీసింది. చివరకు ఆందోళనకారులను చెదరగొట్టడంతో రాత్రి వేళ పోలీసు పహారా నడుమ కౌన్సెలింగ్ కొనసాగింది.

ఇటీవల సీఎం సమక్షంలో నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం పాఠశాలల కేటాయింపు నిమిత్తం కౌన్సెలింగ్ కోసం పిలిచారు. మొత్తం 266 మందిని పిలవగా.. ఇందులో కొందరు తమకు కోరిన పోస్టు కాకుండా మరో కేటగిరి పోస్టు కేటాయించారని కొందరు, మెరిట్ జాబితాలో 12వ ర్యాంకు కలిగిన తనకు అవకాశం ఇవ్వలేదని మరొకరు, స్కూల్‌అసిస్టెంటుకు బదులు ఎస్జీటీ పోస్టు కేటాయించాలని ఇంకొందరు కౌన్సెలింగ్‌ను అడ్డుకోవడం ఆందోళనకు దారితీసింది. ఓ దశలో బాధిత అభ్యర్థులు, సంఘనాయకులు డీఈవో ప్రణీతను చుట్టుముట్టి వాగ్వాదానికి దిగడం ఘర్షణ వాతావారణం తలపించింది. పరిస్థితి చేయిదాటడంతో డీఈవో పాలనాధికారి రాజర్షిషాకు సమాచారం ఇవ్వడంతో.. హుటాహుటిన అదనపు పాలనాధికారి శ్యామలదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత బాధిత అభ్యర్థులు, సంఘనాయకులతో చర్చలు జరిపారు. ఫలితం లేకపోవడంతో చివరకు రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడతామని అందరిని బయటకు పంపించారు. ఈ క్రమంలో ఎంపిక జాబితాలో అవకతవకలు జరిగాయంటూ డీఈవో, సిబ్బంది వైఖరిని నిరసిస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. బాధిత అభ్యర్థులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చినా వినిపించుకోకపోవడంతో చివరకు పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈడ్చుకెళ్లి బయటకు పంపించడం ఉద్రిక్తతను తలపించింది.


రాత్రివేళ అభ్యర్థుల పడిగాపులు

భోజనం తెప్పించి.. అరెస్టయి!
- పోలీసుల అదుపులో ఎమ్మెల్యే తనయుడు


డీఈవో కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే తనయుడు పాయల్ శరత్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

డీఎస్సీ అభ్యర్థులు ఆకలితో అలమటిస్తున్న విషయం తెలుసుకుని డీఈవో కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ తనయుడు శరత్(బన్నీ)ని పోలీసులు అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసుస్టేషన్ తరలించడం చర్చనీయాంశంగా మారింది. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు చెదరగొడుతుండగా.. అక్కడికి వచ్చిన బన్నీని పోలీసులు అదుపులోకి తీసుకోవడం వాగ్వాదానికి దారితీసింది. తాను అభ్యర్థులకు భోజనం, నీటివసతి కల్పించేందుకు వచ్చానని చెప్పేయత్నం చేసినా పోలీసులు వినిపించుకోకుండా స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన భాజపా కార్యకర్తలు స్టేషన్ ఎదుట గుమిగూడటం.. స్వయంగా ఎస్పీ గౌష్ ఆలం రంగప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. మరో వైపు కౌన్సెలింగ్‌కు వచ్చిన అభ్యర్థులకు, వారి బంధువులకు పాయల్ ఫౌండేషన్ తరపున భోజనం, నీటి వసతి కల్పించారు.

కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం

ఆందోళనకు దిగిన అభ్యర్థులకు చివరకు హామీ పత్రం రాసుకుని పోస్టింగ్ ఇవ్వడంతో వారి స్థానంలో అప్పటికే ఎంపికై కౌన్సెలింగ్‌కు వచ్చిన వారిని పిలవకపోవడంతో సంబంధీకులు ఆవేదనకు గురయ్యారు. సీఎం సభకు వెళ్లిన నియామకపత్రాలు చూపిస్తూ అధికారులను సంప్రదించేయత్నం చేసినా వారి గోడు వినేవారే కరవయ్యారు. బాధిత అభ్యర్థుల స్థానాల్లో ఇతరులను ఎంపిక చేయకపోవడం.. ఎంపికైన వారినే పక్కకు పెట్టడం ఏం జరుగుతుందో తెలియని అయోమయం నెలకొంది. అధికారులు చేసిన తప్పిదానికి తమకు ఆనందం దూరమైందని పలువురు వాపోయారు.

అధికారిక సెలవు ప్రకటించాలి

ఇచ్చోడ: కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించాలని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. ఇచ్చోడ మండలం మేడిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 17న ఇచ్చోడలో వర్ధంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ సంఘాల నాయకులు కొడప నగేష్, కుమ్రం కోటేశ్వర్, ఆత్రం మహేందర్, శేఖర్, మేస్రం శంభు, భీంరావు, రాము తదితరులు ఉన్నారు.

బిల్లులు రాక.. పనులు సాగక

- అందుబాటులోకి రాని గ్రామ పంచాయతీ భవనాలు

తాంసి, న్యూస్‌టుడే

పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు కరవయ్యాయి. సమస్యల పరిష్కారం, సమావేశాలు, రికార్డుల నిర్వహణ, అభివృద్ధి పనులు ఇలా అన్నీ ఇక్కడి నుంచే నిర్వహించాల్సి ఉంటుంది. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పలు చోట్ల పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాక వేగం తగ్గింది. మరికొన్ని చోట్ల ఇతర కారణాలతో పనులు మొదలవలేదు.


జిల్లాలో ఇదీ పరిస్థితి..
- మంజూరైన పంచాయతీ భవనాలు : 101
- పూర్తయినవి : 05
- అసలే ప్రారంభం కానివి : 26
- వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నవి : 70

అయిదు మాత్రమే పూర్తి..

ప్రతి పంచాయతీకి సొంత భవనం ఉండాలన్న ఉద్దేశంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 101 పంచాయతీలకు రెండేళ్ల కిందట భవనాలు మంజూరుకాగా ఇంతవరకు అయిదు చోట్ల మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. 70 భవనాలు పిల్లర్లు, స్లాబ్ స్థాయి దశలో అసంపూర్తిగా ఉండిపోయాయి.


గుబిడిపల్లెలో అసంపూర్తిగా..

భీంపూర్ మండలం గుబిడిపల్లెలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనమిది. స్లాబ్ వరకు నిర్మాణం పూర్తయింది. పక్క గోడలు, తలుపులు, కిటికీల బిగింపు, ఫ్లోరింగ్, రంగులు వేయడం తదితర పనులు మిగిలిపోయాయి. బిల్లులు రాక పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం చిన్న అద్దె గదిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సమావేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడానికి ఇబ్బందులు పడుతున్నారు.


పిల్లర్లకే పరిమితం

తాంసి మండల కేంద్రంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం బేస్‌మెంట్, పిల్లర్ల దశలో నిలిచిపోయింది. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా ఉంది. ప్రస్తుతం ఇరుకు గదిలో సమావేశాల నిర్వహణతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


స్లాబ్ వరకు..

తలమడుగు మండలం ఉమ్డం గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని రెండేళ్ల కిందట ప్రారంభించారు. స్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

ఆదిలాబాద్ గ్రామీణ మండలంలో 2, జైనథ్‌లో 6, ఇచ్చోడలో 4, గుడిహత్నూర్ 1, తలమడుగులో 1, గాదిగూడ 1, నేరడిగొండలో 2, బజార్‌హత్నూర్‌లో 5, భీంపూర్‌లో 1, బోథ్‌లో 3 భవనాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

త్వరగా పూర్తి చేయిస్తాం..
- శివరాం రాఠోడ్, పీఆర్ ఈఈ

స్థల సమస్య, బిల్లులు సకాలంలో విడుదల కాక సమస్యగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, గుత్తేదారులను సంప్రదించి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయిస్తాం.

ఖర్చు స్వల్పం.. వినియోగం అంతంతమాత్రం!

- ఉమ్మడి జిల్లాలో కూరగాయలు, పండ్ల వాడకం చాలా తక్కువ
- నేడు ప్రపంచ ఆహార దినోత్సవం


న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

కూటి కోసం కోటి విద్యలు అన్నారు. ప్రపంచం మొత్తంలో ఎవరు ఏ పని చేసినా.. ఆకలి తీర్చుకోవడానికే.. తర్వాతే మిగిలినవన్నీ. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని చెప్పుకొంటున్నా అక్కడక్కడ ఆకలి కేకలు వినిపిస్తూనే ఉన్నాయి. కొన్ని చోట్ల విపరీతమైన ఆహారం వృథా అవుతూనే ఉంది. రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే ఆహారంపై అతి తక్కువగా ఖర్చు చేస్తున్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా ఆహార పరిస్థితులపై కథనం.

జిల్లాలో ఆహార పంటల్లో అత్యధికంగా వరితో పాటు పప్పుధాన్యాల సాగు ఉంటుంది. ఇతర జిల్లాలతో పోలిస్తే సోయా, కంది పంటల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నా.. పేదరికం కారణంగా అనేక మంది పూట గడవడానికి కూలీ పనులు చేస్తూ పొట్ట నింపుకొంటున్నారు.

ఎందుకంటే?

ప్రపంచ ఆహార దినోత్సవం 1979లో ఏర్పాటు చేశారు. అక్టోబరు 16న ఐక్యరాజ్యసమితి, ఆహార, వ్యవసాయ సంస్థ(యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్‌కు సంబంధించిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) స్థాపించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా 150 కంటే ఎక్కువ దేశాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఏటా ఒక అంశం(థీమ్)పై అవగాహన కలిగిస్తారు. ఈ ఏడాది మెరుగైన జీవితం, మెరుగైన భవిష్యత్తు కోసం ఆహార హక్కును అంశంగా ప్రకటించారు.



ఉమ్మడి జిల్లాలో ఏటా పంటల ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)

వరి	కందులు	పప్పుధాన్యాలు (చిరుధాన్యాలతో కలిపి)	కూరగాయలు
5.25	9.60	5.35	24.35

పండ్లు	పాలు	చేపలు	మాంసం
2,842 టన్నులు	3.28 లక్షల లీటర్లు	38 వేల టన్నులు	43 వేల టన్నులు

భారీగా వృథా..

జిల్లాలో కొంత మంది అర్థాకలితో అలమటిస్తుంటే.. పలు చోట్ల ఆహారం వృథా చేస్తున్నారు. ప్రధానంగా వివాహాలు, ఇతర వేడుకలతో పాటు హోటళ్లలో వృథా శాతం ఎక్కువగా ఉంటోంది. వృథా చేసే బదులు దాన్ని ఉపయోగంలోకి తీసుకొస్తే.. పేదలకు కొంత మేలు జరిగే వీలుంది. అవసరమైన సౌకర్యాలు లేక పండించిన పంటలలో కూరగాయలు, పండ్లు త్వరగా చెడిపోతున్నాయి. ఉత్పత్తి ఎక్కువగా ఉన్న సమయంలో నిల్వ చేసుకునే సదుపాయాలు లేక తక్కువ ధరకే ఇవ్వడం లేదా బయట పారేయాల్సిన పరిస్థితి ఉంటోంది. మన దేశంలో ఏటా వృథా అయ్యే కూరగాయలు, పండ్ల విలువ రూ.40 వేల కోట్లు ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.

మీకు తెలుసా?

- ప్రపంచంలో ప్రతి ఒక్కరికి ఆహారం ఇవ్వడానికి అవసరమైన ఉత్పత్తి ఉన్నా.. తొమ్మిది మందిలో ఒకరు దీర్ఘకాలిక ఆకలితో బాధ పడుతున్నారు.
- ఆకలితో ఉన్న వారిలో 60 శాతం మంది మహిళలే..
- 45 శాతం మంది శిశు మరణాలు పోషకాహార లోపం కారణంగానే సంభవిస్తున్నాయి.
- భారత జనాభాలో పోషకాహార లోపంతో బాధ పడుతున్న వారు 14.5 శాతం కాగా, తక్కువ బరువుతో ఉన్న పిల్లలు 20 శాతం, రక్తహీనతతో బాధపడే మహిళల శాతం 51.4 ఉంది.

పేదలకు పంచి.. ఆకలి తీర్చి..



నిర్మల్ జిల్లాకు చెందిన నరహరి, ఆయన మిత్రులు నవీన్, వినోద్, చిట్టినేత, రామ్‌రాజ్ తదితరులు కలిసి ఫుడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆహారం వృథాగా ఉన్న సమాచారం అందిస్తే అక్కడి నుంచి ఆహారాన్ని తీసుకొచ్చి అవసరమైన వారికి పంచిపెడుతున్నారు.


సెల్‌ఫోన్‌లో సమాచారం తెలుసుకుంటున్న అభ్యర్థులు

ఆ పాఠశాల ఎక్కడ.. ఎంత దూరం?

డీఎస్సీ-2024 కౌన్సెలింగ్‌కు ముందు విద్యాశాఖ ఖాళీల జాబితాను విడుదల చేయడంతో అభ్యర్థులు తమకు ఏ పాఠశాల రావొచ్చో తెలుసుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ఆ పాఠశాల ఉండే గ్రామానికి బస్సు సౌకర్యం ఉందా? లేదా? ఎలా వెళ్లాలి? ఊరు బాగుందా? లేదా అంటూ ఆరాతీయడం కనిపించింది. ఈ క్రమంలో ఎవరిని చూసినా ఇలా చరవాణులతో ఇతరులను సంప్రదిస్తూ కనిపించారు.

- ఈనాడు - ఆదిలాబాద్, - న్యూస్‌టుడే - పాలనాప్రాంగణం

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే : డిగ్రీ, పీజీ కళాశాలలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి యాజమాన్యాలకు చెల్లించాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వహణ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ తమ సంఘం పిలుపు మేరకు మంగళవారం నుంచి జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలలు మూసివేసినట్లు స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో పేర్కొన్నారు. 2021-22 సంవత్సరానికి బడ్జెట్ కేటాయించి టోకెన్లు ఇచ్చినా బకాయిలు విడుదల చేయలేదన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ నిధులు సైతం విడుదల చేయలేదన్నారు. బుధవారం కుమురం భీం చౌరస్తాలో ధర్నా చేపట్టడానికి నిర్ణయించామన్నారు. సంఘం అధ్యక్షుడు హన్మాండ్లు, ప్రతినిధులు మొహ్మద్ బిలాల్, పొన్నారావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గాదిగూడ ఎస్ఐపై కేసు నమోదు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : గాదిగూడ పోలీసు స్టేషన్ ఎస్ఐపై అదే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. షేక్ అతీఖ్ ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గాదిగూడ ఎస్ఐ మహేశ్ తన కారుతో లోకారి గ్రామం వద్ద ఢీకొట్టాడు. షేక్ అతీఖ్ కాలు నుజ్జునుజ్జు అయింది. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శనివారం ఆదిలాబాద్ ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద నిరసన సైతం వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు గాదిగూడ ఎస్ఐ మహేశ్‌పై నార్నూర్ సీఐ రహీంపాషకు సోమవారం ఫిర్యాదు అందజేశారు. ఆయనపై కేసు నమోదైంది. ఎస్ఐ తీరుపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు సమాచారం.

భీం నినాదం.. అమలుకు దూరం!

జల్..

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతవాసులకు కుమురం భీం జిల్లా ధనోరా ఇన్‌టేక్‌వెల్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. 220 గ్రామాలకు వైఎస్ ప్రభుత్వ హయాంలో పైప్‌లైన్ వేశారు. రూ.70 కోట్లు వెచ్చించారు. 2017-2020 వరకు పలుమార్లు మరమ్మతుల పేరుతో రూ.22 కోట్లు వెచ్చించారు. కుమురం భీం జలాశయంలోని ఇంటెక్‌వెల్‌లో (42 ఎంఎల్‌డీ-మిలియన్ లీటర్ పర్‌డే) చిన్నపాటి వర్షం వచ్చినా బురద పేరుకుంటుంది. ఇక్కడ మరో ఇన్‌టేక్‌వెల్, పైప్‌లైన్ మరమ్మతులకు ప్రభుత్వం మార్చిలో రూ.60 కోట్లు మంజూరు చేసినా.. పనులు ప్రారంభం కాలేదు. వందలాది గిరిజన గ్రామాల ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.


కుమురం భీం జలాశయంలో ధనోరా ఇన్‌టేక్‌వెల్ వద్ద వర్షం వస్తే పేరుకుంటున్న బురద

జంగల్..

ఆదివాసీలు చేసుకునే ప్రతి పండగ అడవితో ముడిపడి ఉంటుంది. నాలుగు జిల్లాల పరిధిలో కవ్వాల్ పులుల అభయారణ్యం విస్తరించి ఉంది. కోర్, బఫర్ ఏరియాలతోపాటు, మైదాన ప్రాంతాల్లో పల్లెలు విస్తరించి ఉన్నాయి. పులుల కదలికల నేపథ్యంలో అటవీ అధికారులు తీవ్రమైన ఆంక్షలు పెడుతుండటంతో.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కవ్వాల్ అటవీ ప్రాంతం:
- కోర్ ఏరియా: 822.23 చ.కి.మీ.
- బఫర్ ఏరియా: 1123.21 చ.కి.మీ.
- బఫర్ ఏరియాలో గ్రామాలు: 42

జమీన్..

మొదటి నుంచి గిరిజనుల జీవనాధారం పోడు వ్యవసాయం. 2008, 2023 లో పోడుదారులకు ప్రభుత్వాలు అటవీ హక్కు పత్రాలు అందజేసినా, ఇప్పటికీ రాని వారు ఉమ్మడి జిల్లాలో అనేకం. వీరందరూ రైతు భరోసా, బీమా పథకాలకు దూరమవుతున్నారు. కుటుంబ సభ్యులకు విరాసత్ సైతం కావడం లేదు. వెబ్‌సైట్‌లో పలు సాంకేతిక సమస్యలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

- గిరిజనులకు ఇంకా అందాల్సిన పోడు పట్టాలు: 33,885
- సాగు చేస్తున్న భూమి: 1.24 లక్షల ఎకరాలు



ఈనాడు, ఆసిఫాబాద్


జల్, జంగల్, జమీన్ నినాద సాధనే లక్ష్యంగా, ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయంగా ప్రాణాలను త్యజించిన పోరాట యోధుడు కుమురం భీం 84వ వర్ధంతికి పోరాటాల పురిటిగడ్డ జోడేఘాట్ సన్నద్ధమైంది. 'మావనాటే మావరాజ్' (మా ఊరిలో మా రాజ్య స్థాపనే) ధ్యేయంగా భీం 12 గ్రామాలను ఒక్కటి చేసి తుడుం మోగించారు. వీటినే పోరు గ్రామాలుగా పిలుస్తారు. భీం ప్రాణత్యాగంతో కొంత మేరకు ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆయన లక్ష్యం ఇప్పటికీ దూరంగానే ఉంది.


పోరు గ్రామాల అవస్థలు..

కెరమెరి మండలంలోని టోకెన్‌మోవాడ్, లైన్‌పటార్, బాబేఝరి, శివగూడ, పిట్టగూడ, కల్లెగాం, పట్నాపూర్, చాల్‌బడి, పాటగూడ, చిన్న పట్నాపూర్, గోండుగూడ, కొపగూడలు.. పోరు గ్రామాలుగా కాగా వీటి పరిధిలో 2800 వరకు జనాభా ఉంది. లైన్‌పటార్, పిట్టగూడ గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదు. చాల్‌బడి, పాటగూడది ఇదే పరిస్థితి. శివగూడ, పిట్టగూడ ప్రజలకు నిత్యం, వేసవి వచ్చిందంటే మిగతా గ్రామవాసులకు తాగునీటికి చెలమలు లేదా వాగుల వద్దకు పరుగులు పెట్టాల్సిందే.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో
- గిరిజన జనాభా: 4.95 లక్షలు
- గిరిజన మండలాలు: 38
- గ్రామాలు: 1758
- అనుబంధ గ్రామాలు: 3,859

నాలుగేళ్ల కిందట జోడేఘాట్‌లో 31 ఇళ్లు మంజూరు కాగా నేటికీ పూర్తి కాలేదు. హట్టి నుంచి జోడేఘాట్‌కు వెళ్లే మార్గంలో 8 కి.మీ. రోడ్డు అటవీ అనుమతులు లేక నిలిచిపోయాయి.


లైన్‌పటార్‌కు వెళ్లే దారి రాళ్లతో నిండి..


శివగూడలో చెలమ నీటిని తీసుకుంటున్న ప్రజలు

మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత హానికరం


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న అదనపు పాలనాధికారి శ్యామలదేవి

ఎదులాపురం, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం పాడవుతుందని, ఆర్థికంగా నష్టపోతారని జిల్లా అదనపు పాలనాధికారి శ్యామలదేవి సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా పట్టణంలోని డీవ్ డీఅడిక్షన్ కేంద్రంలో మంగళవారం 'మిషన్ పరివర్తన కార్యక్రమా'న్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్యామలదేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, గంజాయి, మద్యం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. 'నషా ముక్త్ భారత్' గోడప్రతులను ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమాధికారిణి సబిత, తదితరులు పాల్గొన్నారు.



జానకి షర్మిల, ఎస్పీ

ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్.. వేదికైతేనేం చాలామంది తమ అభిరుచికి అనుగుణంగా చిన్నచిన్న వీడియోలు, ఫొటోలతో ప్రపంచం ముందుకొస్తున్నారు. తమ అనుభవాలను పంచుకుంటున్నారు. కళాతృష్ణను తీర్చుకుంటున్నారు. కాస్త సృజనాత్మకతను జోడించి ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో మీరూ ఉన్నారా.. అయితే ఈ అవకాశం మీకోసమే. పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాలను పురస్కరించుకొని ఔత్సాహికుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు, పోలీసుశాఖ సేవలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తున్నారు. - న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం

చిత్రం తీస్తారా.. లఘుచిత్రం రూపొందిస్తారా..!

● పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోటీలు

ఏం చేయాలంటే..

అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏటా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. ఫొటో-వీడియోగ్రాఫర్లతో పాటు విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు జరుపనుంది. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా ఇటీవల కాలంలో తీసిన 3 ఫొటోలు, 3 నిమిషాల్లోపు నిడివితో ఉన్న లఘుచిత్రాలు రూపొందించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించొచ్చు. వీటిని పెన్‌డ్రైవ్‌లో వేసి, ఫొటోలు 10/8 సైజులో సిద్ధం చేయాలి. మాదకద్రవ్యాలు-ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తిప్రతిష్ఠలు, సైబర్‌నేరాలు- ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగం- కలిగే అనర్థాలపై గత సంవత్సరం అక్టోబరు నుంచి ఈ సంవత్సరం అక్టోబరు వరకు తీసిన ఫొటోలు, లఘుచిత్రాలు పోటీలకు పంపించేందుకు అవకాశముంది. జిల్లాస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన వాటిని రాష్ట్రస్థాయికి పంపించనున్నారు. అక్కడ గెలుపొందిన వారికి నగదు పురస్కారం లభిస్తుంది.


ప్రతిభ చాటుకునే అవకాశం

మావోయిస్టులు, టెర్రరిస్టులు, సంఘ వ్యతిరేకశక్తులతో పోరాడే క్రమంలో అమరులైన వారి త్యాగాలను స్మరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పలురకాల పోటీలు నిర్వహిస్తుంటాం. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తాం. తీసిన చిత్రాలు, రూపొందించిన లఘుచిత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ కోర్ విభాగంలో ఈనెల 20 లోపు అందజేయాలి. ఏవైనా సందేహాలుంటే చరవాణి 87125 77719లో సంప్రదించాలి.
-డా.జి.జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు

ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యార్థులు విద్యతో కూడిన మొబైల్ ఫోన్ వినియోగం, డ్రగ్స్ రహిత విద్యార్థులు, తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై ఆన్‌లైన్ వేదికగా వ్యాసరచన పోటీలు ఉంటాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో రాసేందుకు అవకాశముంది. విద్యార్థులు తాము రాసిన వ్యాసాలను nirmalitct@gmail.com కి అక్టోబరు 20 లోపు మెయిల్ చేయాలి. ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపికచేసి బహుమతులు అందజేస్తారు. అత్యుత్తమంగా ఉన్నవాటిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తారు.

గిజిగాడు.. సాహసికుడు!



పిచ్చుకలు తమ సంతాన రక్షణకు నిర్మించుకునే గూళ్లలో చూపించే నైపుణ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. కుంటలు, చెరువుల్లోకి వంగిన చెట్ల కొమ్మలకు సమూహాలుగా ఒకేచోట వేలాడేలా నిర్మించుకుంటాయి. మరికొన్ని గిజిగాని సమూహాలు మాత్రం ఒక అడుగు ముందుకేసి పాములు ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లు, పిల్లల్ని కాపాడుకునేందుకు ఏకంగా కరెంటు తీగలకు గూళ్లు అల్లుకుంటాయి. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి - డ్యాంగాపూర్ గ్రామాల మధ్య పచ్చని పంట పొలాలపై ఉన్న విద్యుత్తు తీగలకు పక్షులు వందల సంఖ్యలో గూళ్లు నిర్మించుకున్నాయి. దారిన పోయేవారికి కరెంటు తీగలకు తోరణాలు కట్టారా అన్నంత గుంపులుగా ఉన్నాయి.
- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

ఈ యువకులు సాంస్కృతిక వారసులు



తయారు చేసిన గుస్సాడీ టోపీతో మడావి సోను



టోపీ తయారు చేస్తున్న సెడ్మకీ కోండు

లింగాపూర్, న్యూస్‌టుడే: దీపావళి సమీపిస్తుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడేల్లో దండారీ ఉత్సవాల సందడి మొదలైంది. ఆదివాసీ గిరిజన జీవనశైలి, సంస్కృతి ప్రతిబింబించే పండగల్లో ప్రధానమైంది దండారీ వేడుక. ప్రత్యేకంగా నెమలి ఈకలతో తయారుచేసిన టోపీలు ధరించి గుస్సాడీ వేషధారణలతో ఈ పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ. పండగకు కొన్ని రోజుల ముందు నుంచే గూడేల్లో కోలాహలం ప్రారంభమవుతుంది. నెమలి ఈకలు సేకరించి టోపీలు తయారు చేయడంలో పలువురు పెద్దలు ప్రత్యేకత చాటుకుంటున్నారు. పెద్దల నుంచి తయారీలో మెళకువలు నేర్చుకుని ఓవైపు జీవనోపాధితోపాటు మరోవైపు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఆచరిస్తూ వారసత్వ సంపదను కాపాడుకుంటున్నారు.. కుమురంభీం జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామానికి చెందిన యువకులు సెడ్మకీ కోండు, మాడావి సోను. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటర్ పూర్తయిన తర్వాత పైచదువులకు వెళ్లలేకపోయారు. తమ కాళ్ల మీద తాము నిలబడాలనే ఉద్దేశంతో టోపీల తయారీపై దృష్టి పెట్టి ఉన్న ఊళ్లోనే ఉపాధి పొందుతున్నారు. ఏటా ఉత్సవాలకు 150-200 వరకు టోపీలు తయారు చేస్తుంటారు. ఉమ్మడి జిల్లాతో పాటు జగిత్యాల, మహారాష్ట్రలోని పలు జిల్లాలకు గుస్సాడీ టోపీలను తయారు చేసి పంపిస్తున్నారు. ఒక టోపి తయారీకి రూ.2500 నుంచి రూ.3 వేలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు.

పత్తి విక్రయాల్లో సాంకేతికత

● అందుబాటులోకి వాట్సాప్ నెంబరు 88972 81111

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :



పత్తి విక్రయాల సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఈ సీజన్‌లో మార్కెట్ అధికారులు సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంతో పత్తిని ఎక్కడ, ఎంత మొత్తం విక్రయించాలి, డబ్బులు ఎప్పుడు బ్యాంకులో జమ చేస్తారనే సమాచారం కోసం రైతులు ఇబ్బందులు పడేవారు. పత్తి క్రయవిక్రయాల్లో అక్రమాలను అరికట్టడంతో పాటు, రైతులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు వీలుగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతులు వాట్సాప్ నెంబరును నమోదు చేసుకొని 'హాయ్' అని సందేశం పంపడంతో పాటు తమ ఆధార్‌కార్డు నమోదు చేస్తే కావాల్సిన సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది. ఇంకేందుకు ఆలస్యం పత్తి రైతులు 88972 81111 నెంబరును నమోదు చేసుకోండి.

ఉమ్మడి జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుంది.. ఈ లెక్కన ఈ సీజన్‌లో 68 లక్షల క్వింటాళ్ల పత్తి మార్కెట్లకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. రైతుల సమస్యలకు పరిష్కారంగా వన్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. పత్తి విక్రయాలు, అర్హత, అమ్మకాల వివరాలు, తకపట్టి, చెల్లింపు స్థితి, సీసీఐ కేంద్రాల్లో వేచి ఉండే సమయం, కొనుగోలు వివరాలు తదితర వాటిని తెలుసుకునే వీలుంది. పంట సమగ్ర సర్వే, బ్యాంకు, ఆధార్ కార్డుతో అనుసంధానం ఉన్న చరవాణి నెంబరుతో వాట్సాప్ సేవలను పొందే అవకాశం ఉంది.

సమస్త సమాచారం

- గజానంద్, డీఎంఓ, ఆదిలాబాద్

పత్తి విక్రయాలకు సంబంధించి సమస్త సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఈ సీజన్‌లో వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రూ. 7 రుసుం.. చెల్లించటం ఎంత కష్టమో





ఈటీవీ - ఆదిలాబాద్ :

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంఘాలు, పొరుగు సేవల సిబ్బంది, ప్రైవేటు విద్యా, వైద్య సంస్థలు, జిన్నింగ్ పరిశ్రమలు సహా అన్ని రకాల దుకాణాల్లో పని చేసే సంఘటిత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా 1987 నుంచి ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ నిధి చట్టం అందుబాటులోకి వచ్చింది. 2014లో తెలంగాణ కార్మిక సంక్షేమ మండలిగా రూపాంతరం చెందినా కార్మికుల సంక్షేమం గాలిలో దీపంలా మారింది. కార్మికుల వివాహ కానుక, విద్యా ప్రోత్సాహకాలు, దివ్యాంగులైన కార్మికుల పిల్లలకు విద్యా ప్రోత్సాహకాలు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స ఖర్చులు, ప్రమాద, సహజ మరణాల్లో అందించాల్సిన పరిహారమంతా నామమాత్రంగా మారింది.

పట్టింపు శూన్యం

కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రభుత్వం అమలు చేసే పథకాలపై అవగాహన కొరవడుతోంది. ఏడాదికి కార్మికుడి వాటా రూ.2, సంస్థ వాటా రూ.5 చొప్పున రూ.7 చెల్లిస్తే కార్మిక మండలి నిధికి చెల్లిస్తే ప్రభుత్వం అమలు చేసే ప్రోత్సాహకాలను పొందటానికి ఆస్కారముంటుంది. కార్మికశాఖ సహా వివిధ సంస్థల పట్టింపులేనితనంతో కార్మిక మండలి నిధి సరిగా అమలు కావటం లేదు. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పరిశ్రమలు, ఇతర సంస్థల్లో ఎంత మంది కార్మికులు పని చేస్తున్నారనేది నిర్దిష్టంగా తెలటం లేదు. కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకున్న వివరాల ప్రకారం కేవలం 13,903 దుకాణాల్లో 40,026 మంది కార్మికులు పని చేస్తున్నట్లు తేలింది. మిగిలిన పరిశ్రమలు, సంస్థల పేర్ల నమోదు పట్టింపులేని అంశంగా మారింది.

ఏపీలో భేష్

ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుడి వాటా రూ.30, సంస్థ వాటా రూ.70 చొప్పున ఏడాదికి రూ.100 చెల్లించటంతో కార్మికులకు భరోసా కనిపిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులకు రూ.50 వేలు, ప్రమాద మరణమైతే రూ.5 లక్షలు, ప్రమాదంతో వచ్చే అంగవైకల్యానికి రూ.1.25 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు సాయం లభిస్తోంది. ఏపీలో అమలు చేసినట్లు ప్రోత్సాహకాలు అందిస్తే పేద కార్మికులకు మేలు కలుగుతుంది.

కార్మికుడి వాటా రూ.2, పని చేసే సంస్థ వాటా రూ.5. రెండూ కలిపితే రూ.7 అవుతుంది. వాటిని ఏడాదికో సారి కార్మిక మండలి నిధికి చెల్లిస్తే కొంత లబ్ధి చేకూరుతుంది. కానీ అవి చెల్లించకపోవటంతో సంక్షేమ ప్రయోజనాలు కార్మికులకు చేకూరడం లేదు. కార్మిక మండలి ద్వారా చెల్లించే ప్రోత్సాహకాలే తక్కువనుకుంటే వాటికీ నోచుకోలేని సంఘటిత కార్మికుల దయనీయత వెల్లడించే వ్య(క)థ ఇది.

● సంఘటిత కార్మికుల దరిచేరని సంక్షేమం

అనేక ప్రయోజనాలున్నా..

కార్మిక శాఖలో దుకాణం పేరు నమోదై ఉంటే కార్మికులు దీర్ఘకాలిక వ్యాధులకు గురైతే చికిత్సకు రూ.20 వేల సాయం పొందొచ్చు. ప్రమాదంలో చనిపోతే రూ.30 వేలు, సహజ మరణమైతే రూ.10 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు, అంగవైకల్యం బారినపడితే రూ.10 వేల నుంచి రూ.20 వేల సాయం పొందొచ్చు. పెళ్లి కానుకగా రూ.10 వేలు, ప్రసూతి సాయం రూ.5వేలు, పిల్లల ఉపకార వేతనాలుగా రూ.1000 నుంచి రూ.2 వేల వరకు లబ్ధి చేకూరుతుంది

పాలకుల తప్పిదమే



ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే రాష్ట్రంలో కార్మికులకు ప్రయోజనమేం కలగటం లేదు. ప్రశ్నించలేనితనం కార్మికులదైతే, పట్టింపులేనితనం సంస్థలది. అందుకే విశ్రాంత అధికారిగా ఈ నెల 16న కార్మిక భేరి ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.
- జగదీశ్వర్‌రెడ్డి, విశ్రాంత కార్మిక శాఖాధికారి

● జిల్లా ● దుకాణాలు ● కార్మికులు

జిల్లాల వారీగా పేర్లు నమోదు చేసుకున్న దుకాణాలు, కార్మికుల వివరాలు

జిల్లా	దుకాణాలు	కార్మికులు
ఆదిలాబాద్	2650	7650
నిర్మల్	2380	6860
మంచిర్యాల	7250	20753
ఆసిఫాబాద్	1623	4763

గురుకుల భవనాలకు తాళం వేసిన యజమానులపై కేసు

తాండూరు: మహాత్మా గాంధీ జ్యోతిబాపులే బీసీ గురుకుల పాఠశాల కొనసాగుతున్న ప్రైవేటు భవనానికి అద్దె చెల్లించడం లేదని యజమాని శరత్‌కుమార్ మంగళవారం ఉదయం ప్రధాన ద్వారానికి తాళం వేశారు. యజమాని మాట్లాడుతూ 9 నెలలుగా అద్దె చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అద్దె చెల్లించే వరకు తాళాలు తీయనని తెలిపారు. పాఠశాలకు తాళం వేయడంతో సిబ్బందితోపాటు విద్యార్థులు ఇబ్బందులు పడ్డట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వినోద్‌కుమార్ తాండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో భవన యజమాని శరత్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

బెల్లంపల్లి పట్టణం: మహాత్మాగాంధీ జ్యోతిబాపులే బీసీ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాల అద్దె భవనానికి తాళం వేసిన యజమాని రుషిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు. పాఠశాల భవనానికి తాళం వేయడంతో బోధన సిబ్బంది, విద్యార్థులు ఇబ్బంది పడ్డారని ప్రిన్సిపల్ పి.రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

అర్చకుల కొరత.. అక్షరాభ్యాసాలకే సుముఖత

● బాసర క్షేత్రంలో కొరవడుతున్న పర్యవేక్షణ

ఈటీవీ- ఆదిలాబాద్: బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రంలో అర్చకుల కొరత పూజాది కార్యక్రమాలకు ప్రతిబంధకంగా మారుతోంది. అమ్మవారి అభిషేకం, అర్చనలో కీలకమైన వేదపండితులు సహా సాధారణ అర్చకులు చాలినంత మంది లేక ఇబ్బందులకు దారి తీస్తోంది. చదువులమ్మ ఆలయం ఇన్‌ఛార్జి ఈవో పర్యవేక్షణలో కొనసాగుతోంది. రెగ్యులర్ ఈవోగా ఉన్న విజయరామారావును మే నెలలో ప్రభుత్వం నిజామాబాద్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది. బాసర ఇన్‌ఛార్జి ఈవోగా పరిమితం చేయడంతో పర్యవేక్షణ పట్టుతప్పుతోంది.

బాసరలో అమ్మవారి అభిషేకంలో వేద పండితులు, అక్షరాభ్యాసాల్లో అర్చకుల పాత్ర కీలకం. సరిపడినంత మంది వేద పండితులు, అర్చకులు లేనందున విధుల నిర్వహణపై ప్రభావం పడుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఎనిమిది మంది వేద పండితులకు నలుగురితోనే సరిపెట్టుకుంటున్నారు. మరో నాలుగు పోస్టులు భర్తీ కావడం లేదు. పూజాది కార్యక్రమాలతోపాటు అక్షరాభ్యాసాలకు 21 అర్చకుల పోస్టులకు 15 మందితోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఫలితంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో కూడిన విధుల నిర్వహణ కన్నా వ్యక్తిగత ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అక్షరాభ్యాసాల విధుల కోసం కొంతమంది అర్చకులు పట్టుబడుతుండటంతో అంతర్గత వివాదాలకు కారణమవుతోంది. ఇటీవల హారతిలో డబ్బులు వేసే సంప్రదాయాన్ని అధికారులు రద్దు చేశారు. అక్షరాభ్యాసాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చిన తర్వాత కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన రెగ్యులర్ ఉద్యోగి లేక కాంట్రాక్టు పద్ధతిలో ఒకరిని నియమించుకోవాల్సి వచ్చింది. ఈ విషయమై ఇన్‌ఛార్జీ ఈవో విజయరామారావును సంప్రదించగా ఖాళీల కారణంగా పూజాది కార్యక్రమాలపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేదపండితులు, అర్చకులు కలిపి మరో 10 మందిని నియమిస్తే ఏ ఇబ్బంది ఉండదని తెలిపారు.

తమ్ముడి తలపై కర్రతో కొట్టిన అన్న

● చికిత్స పొందుతూ మృతి

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నపాటి సమస్యకే అన్నదమ్ములిద్దరూ గొడవ పడ్డారు. క్షణికావేశంలో అన్న కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన తమ్ముడు కొడిపె మల్లయ్య(45) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం అక్కెపల్లికి చెందిన కొడిపె భీమయ్య, మల్లయ్యలు అన్నదమ్ములుకాగా మద్యం తాగి తరచూ ఘర్షణ పడుతుండేవారు. ఈ నెల 13న రాత్రి బాత్రూం నీళ్ల విషయంలో అన్నదమ్ములిద్దరూ గొడవ పడ్డారు. ఆవేశంలో భీమయ్య మల్లయ్య తలపై కర్రతో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయింది. కుటుంబ సభ్యులు చెన్నూరు సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ రవీందర్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.





ఎడ్ల బండ్లలో వెళుతున్న ఆదివాసీ మహిళలు, పోరాట యోధుడి పాటపై ర్యాలీ చిత్రీకరణ దృశ్యాలు

గోండు వీరుడి గాథపై ప్రత్యేక గీతం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : కుమురం భీం పోరాటం, జీవిత చరిత్రను ప్రజలకు చేరువ చేసేందుకు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. ఆమె పర్యవేక్షణలో నాడు భీం చేసిన పోరాటంపై ప్రత్యేకంగా చిత్రీకరించారు. పీఓ పర్యవేక్షణలో రాసిన 'తెలంగాణ ముద్దు బిడ్డా.. మన గిరిజన గోండు బిడ్డా' అనే గీతంపై ఇంద్రవెల్లి మండలం తుమ్మగూడ గోండులతో పరిసర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనను చిత్రీకరించారు. కెరమెరి మండలం జోడేఘాట్ పరిసర ప్రాంతంలో రజాకార్ల సైనికులపై కుమురం భీం చేసిన పోరాట దృశ్యాలను సైతం చిత్రీకరించారు. 17న వర్ధంతి రోజు గీతాన్ని ఆవిష్కరించి గిరిజన గ్రామాలలో ప్రదర్శించేందుకు పీఓ ప్రణాళిక సిద్ధం చేశారు.



గుడిపేట పటాలంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకటరాములు



గుడిపేట పటాలంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అట్టహాసంగా క్రీడా సంబరం

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపేట పోలీసు పటాలంలో మంగళవారం వార్షిక స్పోర్ట్స్‌మీట్ పోటీలను కమాండెంట్ వెంకటరాములు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం అనేక సవాళ్లతో కూడిన విధులు నిర్వహించే పోలీసులకు మానసికంగా, శారీరకంగా నూతనోత్తేజం కల్పించేందుకు ఈ క్రీడలు ఉపయోగపడనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు పటాలంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి పరుగు పందెం, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, టగ్‌ఆఫ్ వార్ వంటి పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళీదాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన సబ్ జూనియర్ విద్యార్థినులు నాగేశ్వరి, వైష్ణవి, నందిని, సరోజ



జూనియర్ విద్యార్థినులు సోని, జంగుబాయి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జంగు, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి తెలిపారు. ఈ నెల 9న నల్గొండలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఖోఖో ఎంపిక పోటీల్లో క్రీడా పాఠశాల విద్యార్థినులు సబ్ జూనియర్ బాలికల విభాగంలో నాగేశ్వరి, వైష్ణవి, నందిని, సరోజ, జూనియర్ విభాగంలో సోని, జంగుబాయిలు అత్యుత్తమ ప్రతిభ చాటి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ఆడనున్నట్లు వివరించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థినులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, తదితరులు అభినందించారు.

పర్వతారోహణ శిక్షణ శిబిరానికి మనోళ్లు

మామడ, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ నెల 16 నుంచి 27 వరకు జరిగే జాతీయ స్థాయి పర్వతారోహణ శిక్షణ శిబిరం(ఆర్‌సీటీసీ)లో పాల్గొనే అరుదైన అవకాశం జిల్లా నుంచి ముగ్గురికి వచ్చింది. మామడ మండలం పొన్కల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి పూర్ణచందర్ నేతృత్వంలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కడెం జడ్పీహెచ్‌ఎస్ కేడెట్‌లు వసంత్, సుమంత్ ఈ శిబిరంలో పాల్గొననున్నారు. దేశ వ్యాప్తంగా 9 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 273 మంది కేడెట్లు ఆర్‌సీటీసీలో శిక్షణ పొందనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం 28 మందికే ఈ అవకాశం దక్కింది. ఈ శిక్షణ శిబిరంలో పర్వతారోహణలో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై మిలటరీ అధికారులు శిక్షణనిస్తారు. ఈ మేరకు పూర్ణచందర్, వసంత్, సుమంత్ మంగళవారం గ్వాలియర్‌కు బయలు దేరారు.



గ్వాలియర్ వెళ్తున్న ఎన్‌సీసీ అధికారి, కేడెట్లు

ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక కౌంటరు

ఖానాపూర్, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు పట్టభద్రుల ఓటు నమోదుకు తహసీల్దార్ కార్యాలయంలో కౌంటరు ఏర్పాటు చేశామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. 2021 నవంబరు 1 లోపు డిగ్రీపూర్తిచేసిన అభ్యర్థులు ఫారం-18, 19లలో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే అవకాశముందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, గుడిహత్నూర్:

? గుడిహత్నూర్ మండలం శాంతాపూర్ పంచాయతీలోని పలు కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. - **జవహర్, శాంతాపూర్**

✔ ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా వెంటనే ఫాగింగ్ చేయిస్తాం. - **దిలీప్‌కుమార్, ఎంపీఓ గుడిహత్నూర్**

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ఎదురుగా చెట్లు కొట్టేసి కొమ్మలు అక్కడే వదిలేయడంతో పాములు తిరుగుతున్నాయి. స్థానికులు భయాందోళన చెందుతున్నారు. - **లోక ప్రవీణ్‌రెడ్డి, కాలనీవాసి**

✔ కార్మికులను పంపించి చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

న్యూస్‌టుడే, బోథ్:

? బోథ్ మండలం మర్లపెల్లిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారు. మద్యం తాగి సీసాలు పగులగొడుతున్నారు. - **స్థానికుడు, మర్లపెల్లి**

✔ సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై చర్యలు చేపడతాం. - **కాశీరాం, పంచాయతీ కార్యదర్శి, మర్లపెల్లి**

తలసీమియాతో బాలిక మృతి


సమయ

బోథ్, న్యూస్‌టుడే : తలసీమియాతో బాధపడుతూ బాలిక మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పొచ్చరకు చెందిన పండుగ స్వామి-గంగామణిలకు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు సమయ(13) పుట్టినప్పటి నుంచి తలసీమియాతో బాధపడుతోంది. నెల రోజుల కిందట తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులు రిమ్స్‌కు, నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

పెన్‌గంగలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


గజానన్

జైనథ్, న్యూస్‌టుడే : పెన్‌గంగ నదిలో పడి సోమవారం గల్లంతైన యువకుడు కినకే గజానన్(33) మృతదేహం మంగళవారం మధ్యాహ్నం లభ్యమైంది. జైనథ్ మండలం డొల్లార సమీపంలోని పెన్‌గంగ నది వద్దకు ఆదిలాబాద్ పట్టణంలోని రణదివెనగర్ కాలనీకి చెందిన గజానన్ కాలనీవాసులతో కలిసి సోమవారం మధ్యాహ్నం దుర్గాదేవి నిమజ్జనానికి వెళ్లాడు. నదిలో స్నానానికి వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. పోలీసులు, కుటుంబీకులు జాలర్లతో మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంగ్వి శివారులో మృతదేహాన్ని జాలర్లు వెలికితీశారు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్‌హెచ్‌వో వెంకట్‌రావు పేర్కొన్నారు. అతడికి భార్య, ఒక కుమార్తె ఉంది.

డీజే వాహనం దగ్ధం


మంటల్లో కాలిపోతున్న డీజే వాహనం

బేల, న్యూస్‌టుడే: మండలంలోని దేవాపూర్ సమీపంలో డీజే వాహనం దగ్ధమైంది. జైనథ్ మండలం మేడిగూడ(ఆర్) గ్రామానికి చెంది డి.అజేయ్ తన డీజే వాహనంతో శారదాదేవి నిమజ్జనం కోసం బేల వైపు వస్తున్నాడు. దారి మధ్యలో దేవాపూర్ అటవీ ప్రాంతంలో వాహనంలోని జనరేటర్‌లో తలెత్తిన విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాహనంతో పాటు డీజే సిస్టం పూర్తిగా కాలిపోయింది. వీటి విలువ రూ.12 లక్షలకుపైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

ఆటో..

ఆదిలాబాద్ నేర విభాగం: మహాలక్ష్మీవాడలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో మంగళవారం తెల్లవారుజామున దగ్ధమైంది. ఆటోను ఉద్దేశపూర్వకంగా కొందరు కాల్చినట్లు అనుమానాలున్నాయని ఆటో యజమాని జాదవ్ పండిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో గాయాలతో శ్రీలేఖ

జైనథ్, న్యూస్‌టుడే : తరోడ(బి) సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జైనథ్‌కు చెందిన ఆకాశ్ తన భార్య శ్రీలేఖతో పాటు మూడేళ్ల కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై జైనథ్ నుంచి ఆదిలాబాద్ వెళుతున్నాడు. తరోడ గ్రామ మూలమలుపు వద్ద వాహనాన్ని తప్పించబోయి రోడ్డు విస్తరణ పనుల కోసం ఏర్పాటుచేసిన సూచికల బోర్డును ఢీకొన్నాడు. ఆకాశ్‌కు, భార్య శ్రీలేఖకు గాయాలయ్యాయి. కుమారుడికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు వెంటనే అంబులెన్సుకు సమాచారం అందించడంతో 108 వాహనంలో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు.

ధర్మమార్గంలో నడవాలి

గుడిహత్నూర్: సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలని హరిభక్త పారాయణ అర్జున్ మహరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉమ్రి పంచాయతీ రామ మందిరంలో శ్రీసంత్ సదానంద్‌బాబా పుణ్యతిథి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదానం చేపట్టారు. లింగాపూర్, శాంతాపూర్, కొల్హారి, గురుజ్, మన్నూర్ తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు అధ్వానం



నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే ఇచ్చోడలో శౌచాలయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చోడలో నిర్వహిస్తున్న ఒకే ఒక సులభ్ కాంప్లెక్స్ అస్తవ్యస్తంగా ఉంది. మూత్రవిసర్జనకు డబ్బులు వసూలు చేస్తున్నారు. మరోవైపు టైల్స్ పగిలి ప్రమాదకరంగా మారాయి.

-ఇచ్చోడ, న్యూస్‌టుడే

వాయిదాలు కట్టలేక.. యంత్రాలు నడపలేక..

★ మహిళా సంఘాలకు భారంగా ట్రాక్టర్ల నిర్వహణ

న్యూస్‌టుడే, తలమడుగు: మహిళా సమాఖ్య సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో డీఆర్‌డీఏ ద్వారా జిల్లాలోని మండలానికి ఒక్కో ట్రాక్టర్‌ను అందజేశారు. కొన్ని సంఘాలు స్త్రీనిధి, మరికొన్ని సంఘాలు మండల సమాఖ్యలోని డబ్బులతో కొనుగోలు చేశాయి. గ్రామాల్లో ట్రాక్టర్లకు గిరాకీ దొరక్కపోవడంతో సమాఖ్య సభ్యులకు వాటి నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుతం బ్యాంకుల్లో తీసుకున్నవారు సైతం నెలవారీ కిస్తీలు కట్టలేని పరిస్థితి నెలకొంది.





★ ఈ చిత్రంలో కనిపిస్తున్న ట్రాక్టర్, రోటవేటర్ తలమడుగు మండలం వసుంధర మండల సమాఖ్యకు అందజేశారు. మొదట్లో పనులతో ట్రాక్టర్‌కు కొంత ఆదాయం ఉన్నప్పటికీ తర్వాత ఎలాంటి పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాల్లో అధికంగా ట్రాక్టర్లు ఉండటం, సమాఖ్య ట్రాక్టర్లకు గిరాకీ లభించకపోవడంతో కొంత ఇబ్బందులు తలెత్తాయి. ఇలా జిల్లాలోని చాలా మండలాల సమాఖ్య సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లావ్యాప్తంగా 18 మండలాలకు 468 పంచాయతీలున్నాయి. ఇందులో 16 మండలాల్లోని మండల సమాఖ్యలకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లు, యంత్రపరికరాలను అందజేశారు. బేల, సిరికొండ మండలాలకు గ్రౌండింగ్ కాకపోవడంతో ట్రాక్టర్‌లు కొనుగోలు చేయలేకపోయారు. జాతీయ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) కింద 25 శాతం గ్రాంట్‌తో రుణాలు పొంది వీటి ద్వారా లబ్ధి పొందాలనేది ఉద్దేశం. కాగా జిల్లాలోని గుడిహత్నూర్ మండలానికి 100 శాతం గ్రాంట్‌తో అందజేశారు. ఇతర వ్యవసాయ పరికరాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం చాలా సమాఖ్యలు నెల నెలా కిస్తీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. మరికొన్ని స్త్రీనిధిలో డిపాజిట్ చేసిన డబ్బులతో వచ్చిన వడ్డీలను చెల్లిస్తున్నారు.

కష్టపడితే ఆర్థికంగా అభివృద్ధి సాధ్యం

- సాయన్న, డీఆర్‌డీవో, ఆదిలాబాద్

జిల్లాలోని 16 మండలాల సమాఖ్యలకు ట్రాక్టర్లను అందజేశాం. వాటి పరిధి ఏపీఎం, సీసీలకు ఒక్కో బాధ్యతలను అప్పజెప్పాం. ఖరీఫ్, రబీ కాలాలను దృష్టిలో పెట్టుకుని ట్రాక్టర్ల ఉపయోగం అధిక మొత్తంలో అయ్యేలా ప్రత్యేక దృష్టిసారించాం. మహిళా సమాఖ్య సభ్యులు, అధ్యక్షులు రైతులకు అవగాహన కల్పించి ముందుకుసాగాలి.

శాంతిభద్రతలను కాపాడండి


ఉట్నూరు డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం చిత్రంలో డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి

ఉట్నూరు, న్యూస్‌టుడే : ప్రజలతో మమేకమై శాంతి భద్రతలను కాపాడాలని ఎస్పీ గౌష్ ఆలం ఆదేశించారు. మంగళవారం ఆయన ఉట్నూరు డీఎస్పీ కార్యాలయం, పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. కేసుల పురోగతి గురించి డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్ఐ మనోహర్‌లను అడిగి తెలుసుకొన్నారు. రికార్డులను పరిశీలించారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

నార్నూర్ (గాదిగూడ), న్యూస్‌టుడే : గాదిగూడ మండలంలోని 10 ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నట్లు పీఆర్టీయూ గాదిగూడ మండలాధ్యక్షుడు మేస్రం శేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన డీఈఓ ప్రణీతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివాసీ ప్రాంత పాఠశాలల్లో విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయులను నియమించి సమస్యను పరిష్కరించాలని

సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులకు సన్మానం

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : సనాతన హిందూ ఉత్సవ సమితి, కేఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో నిర్వహించిన దసరా వేడుకలు విజయవంతం కావడంతో ఆయా శారదామాత మండప నిర్వాహకులు సమితి ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు వారు శాంతినగర్, గందేవార్ తోట, టైలర్స్ కాలనీలో కొలువు దీరిన శారదామాత ప్రతిమలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ రంగినేని మనీష, మండపాల నిర్వాహకులు జ్యోతి, సుజాత, లక్ష్మి, లత, సుజాత, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్‌కుమార్ ఖత్రి, గెడం మాధవ్, కోశాధికారి సూర్యకాంత్, సంజీవ్, సతీశ్ తదితరులు ఉన్నారు.


శారదామాత వద్ద సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, చిత్రంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనీష, మండప నిర్వాహకులు


మాట్లాడుతున్న హీరాసుక జాగృతి సమితి జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్

కుమురం భీం వర్ధంతికి తరలిరండి

ఆదిలాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట హీరాసుక జాగృతి సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న కుమురం భీం వర్ధంతి సభకు తరలిరావాలని సమితి జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ కోరారు. నాయకులు సంభాజీ, మాధవ్, జనార్దన్, శంకర్, ప్రకాశ్, వనిత, గిరిజ తదితరులున్నారు.

బోథ్: బోథ్‌లోని కుమురం భీం విగ్రహం వద్ద ఈ నెల 17న నిర్వహించే వర్ధంతి కార్యక్రమానికి తరలిరావాలని ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. బోథ్‌లోని ఆదివాసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్, మండల అధ్యక్షుడు అమృత్‌రావు, కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.


సొనాలలో అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద సొసైటీ సభ్యులు


నివాళులర్పిస్తున్న అమన్ ఫౌండేషన్ ప్రతినిధులు

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

ఎదులాపురం, సొనాల(బోథ్), న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం అమన్ ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అర్బాజ్‌ఖాన్ మాట్లాడుతూ ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, అమన్ ఫౌండేషన్ ప్రతినిధులు పరమేశ్వర్, అజీమ్ పాల్గొన్నారు. సొనాలలో పులే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడు పోతన్న, కార్యదర్శి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

తలమడుగు: తలమడుగులో బ్లూ భీం యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడు ప్రేమేందర్, గంగాధర్, అరవింద్, గంగన్న, శివమణి, సందీప్, ఈశ్వర్, సాయి పాల్గొన్నారు.

సమాజ జాగృతికి నిరంతరం కృషి

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : సమాజాన్ని జాగృతం చేయడానికి, హిందువుల్లో సంఘటిత శక్తిని పెంపొందించేందుకు ప్రతి స్వయం సేవకుడు నిరంతరం కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ సంఘటన్ మంత్రి ముడుపు యాదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విజయ దశమి మహోత్సవం నిర్వహించారు. హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు ఆర్యన్ మహరాజ్, భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ఆర్ఎస్ఎస్ మండల శాఖ సభ్యులు పాండురంగ్, బాలాజీ, శ్యామ్, వామన్ తదితరులు పాల్గొన్నారు.


గుడిహత్నూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు


రిమ్స్ ఎదుట రహదారిపై అడ్డంగా నిలిపిన అంబులెన్స్

అంబులెన్స్ చోదకుల నిరసన

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : రిమ్స్ ఎదుట రహదారిపై అంబులెన్స్‌ను అడ్డంగా పెట్టి మంగళవారం రాత్రి చోదకులు నిరసన వ్యక్తం చేశారు. ఆసుపత్రి ముందు నిలిపి ఉంచే అంబులెన్స్‌ల కారణంగా తమ కుమారుడు సైకిల్‌పై వెళ్తూ పడిపోయాడన్న ఆగ్రహంతో అతడి తండ్రి అక్కడున్న అంబులెన్స్ సైడ్ మిర్రర్(పక్క అద్దాలు)లను ధ్వంసం చేశాడు. డ్రైవర్లు నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న మావల ఎస్ఐ విష్ణువర్ధన్ అక్కడకు చేరుకొని సయోధ్య కుదర్చటంతో సమస్య పరిష్కారమైంది.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : చలికాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా గాలికుంటు వ్యాధి టీకాలను రైతులు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎమాయికుంటలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉట్నూరు ఏడీ రవికుమార్, ఇంద్రవెల్లి, ముత్నూరు పశు వైద్యులు సుభాష్, స్వదేశ్‌లతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిజాయతీ చాటుకున్న కండక్టర్

ఉట్నూరు గ్రామీణం: ఉట్నూరు డిపో బస్సు ఉట్నూరు నుంచి మంచిర్యాలకు వెళ్తోంది. ఉడుంపూర్‌కు చెందిన ఓ ప్రయాణికుడు బస్సులో కవర్ మరిచిపోయి వెళ్లాడు. అందులో రూ.10 వేల నగదును చూసిన కండక్టర్ సంగీత డిపో ఎస్‌డీఐకి అప్పజెప్పింది. నగదును పోగొట్టుకున్న వ్యక్తి డిపోలో సంప్రదించగా సంబంధిత వ్యక్తికి నగదును అప్పజెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయండి

ఆదిలాబాద్ అర్బన్: ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు రాందాస్, ప్రసన్నకుమార్, సుదర్శన్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న చరవాణి అందజేత

ఆదిలాబాద్ వైద్య విభాగం: తలమడుగు మండలం కజ్జర్లకు చెందిన సతీష్ రిమ్స్‌కు ఉదయం రాగా తన చరవాణిని అత్యవసర విభాగం వద్ద పోగొట్టుకున్నాడు. గుర్తించిన భద్రతా సిబ్బంది రవి ఆ చరవాణిని పోలీసు అవుట్ పోస్టులో అప్పగించారు. అవుట్ పోస్టు పోలీసు వెంకటరెడ్డి చరవాణి పోగొట్టుకున్న వ్యక్తిని గుర్తించి అక్కడకు పిలిపించి అప్పగించారు.

అవసరమైన వారికి న్యాయ సహాయం ఉచితం

ఎదులాపురం: జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న, రిమాండ్‌లో ఉన్న ఖైదీల్లో అర్హులైన వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు దాసరి గంగారాం, అర్గుల అశోక్‌లు పేర్కొన్నారు. జిల్లా జైలులోని ఖైదీలకు మంగళవారం వారు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. కౌన్సిల్ ఉప న్యాయవాది ఉమేష్ డోలె తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌ను విమర్శించే హక్కు వారికి లేదు

ఉట్నూరు గ్రామీణ: ఎస్సీ వర్గీకరణ చేయాలంటే 2024 జనాభా గణన పూర్తయిన తర్వాత చేయాలని అన్నందుకు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామిని రాజీనామా చేయమనే హక్కు, ఆయనను విమర్శించే స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులకు లేదని మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎర్దండి సుశీల్ కుమార్, జిల్లా నాయకులు తొటి ఆశన్న అన్నారు. మంగళవారం ఉట్నూరు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు రాజమణి, రమేష్, ఆశన్న, నందం, ప్రభాకర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

ఎదులాపురం: మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే నినాదంతో చేతుల శుభ్రతపై మంగళవారం స్థానిక సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ‘చేతుల పరిశుభ్రత దినోత్సవం’ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేతులను ఎలా శుభ్రంగా కడుక్కోవాలి అనే విషయాలను ప్రయోగాత్మకంగా అంగన్‌వాడీ కార్యకర్త రాధ చూపించారు. ఏఎన్ఎం తులసీ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై తనయుడి దాడి

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : తల్లిపై కొడుకు దాడి చేసిన ఘటన ఉట్నూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లక్షటిపేటకు చెందిన కుడ్మెత రాంబాయి తనయుడు భీంరావుతో కలిసి ఉంటుంది. రాత్రి భీంరావు మద్యం మత్తులో తల్లిపై కర్రతో దాడి చేయగా కాలికి తీవ్ర గాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించారు.

ద్విచక్రవాహనం దహనం

ఉట్నూరు గ్రామీణం: మండలంలోని నాగాపూర్ చౌరస్తాలో ద్విచక్రవాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం నాగాపూర్‌కు చెందిన భాజపా నాయకుడు కందుకూరి రమేష్ మంగళవారం మధ్యాహ్నం తన వాహనాన్ని నాగాపూర్ చౌరస్తా వద్ద ఉంచి వ్యక్తిగత పని మీద ఆదిలాబాద్‌కు వెళ్లారు. సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. స్థానికులు మంటలు ఆర్పినట్టు తెలిపారు.

భగీరథ లీకేజీ


బెల్గాం వంతెన కింద విరజిమ్ముతున్న భగీరథ నీరు

జైనథ్, న్యూస్‌టుడే: మండలంలోని బెల్గాం గ్రామ సమీపంలో వంతెన కింద మిషన్ భగీరథ నీరు విరజిమ్ముతోంది. కొన్ని రోజులుగా లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

తలమడుగు: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. మంగళవారం తలమడుగు మండలం సుంకిడిలో పర్యటించిన ఆయన పలు కాలనీల్లో తిరుగుతూ ఎక్కడ కూడా అపరిశుభ్రత ఉండకుండా చూడాలన్నారు. ఎంపీవో సుధీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సచిన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అధ్యాపకుడికి డాక్టరేట్

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాటనీ అధ్యాపకుడిగా పని చేస్తున్న మరడా శ్రీనివాస్ మొక్కల పెరుగుదల, ఖనిజ పోషణపై సూక్ష్మజీవుల ప్రభావం అనే అంశంపై చేసిన పరిశోధనలకు రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ మరడా శ్రీనివాస్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మంగళవారం ఉట్నూరులోని కళాశాలలో ప్రిన్సిపల్ ప్రతాప్‌సింగ్, వైస్ ప్రిన్సిపల్ సాయి ప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది శ్రీనివాస్ దంపతులను సన్మానించారు.

భాజపాతో పోరాడి సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే : భాజపాతో దోస్తీని పక్కన పెట్టి పోరాడి సమస్యల పరిష్కారం కోసం నిధులు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సూచించారు. వచ్చే నెలలో జిల్లాలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభల ఏర్పాట్లను పరిశీలించటానికి మంగళవారం వచ్చిన ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్, భీంరావు, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాఘవులు, కిరణ్, సచిన్, దత్తాత్రి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

రెక్కలు విప్పిన అందం



ఆదిలాబాద్ పట్టణం బస్టాండ్ సమీపంలో సీతాకోక చిలుకలు గడ్డి పూలల్లో ఉండే మకరందాన్ని పోటీ పడుతూ తాగుతున్నాయిలా..

– ఈనాడు, ఆదిలాబాద్

మండలాలకు చేరిన దసరా చీరలు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : బతుకమ్మ చీరలు మండల కేంద్రాలకు చేరుతున్నాయి. సరఫరా అయిన చీరల పంపిణీకి ఐకేపీ సిబ్బంది మహిళల పేర్లను సిద్ధం చేస్తున్నారు. ఇంద్రవెల్లి మండలంలో 16500 మంది వరకు మహిళలు ఉన్నట్లు ఐకేపీ సిబ్బంది తెలిపారు.

పశుపోషణపై దృష్టి సారించాలి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : రైతులు పశుపోషణపై దృష్టి సారించాలని ఇచ్చోడ పశువైద్యుడు గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం ఇచ్చోడలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. సిబ్బంది సంధ్య, శేఖర్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులను ఆదుకోండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపానికి ఉద్యమకారులు నివాళులర్పించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలకు చేపట్టిన పాదయాత్రను ఉద్యమకారుడు కారింగుల దామోదర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. 29న పాదయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సామల ప్రశాంత్, తుడం రాములు, బాలశంకర్ కృష్ణ, నరేందర్, శ్రీధర్, సుజాత్ అలీ, ఆంజనేయులు, చాకటి కిరణ్, రఫీక్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఉద్యమకారుడు దామోదర్

ముస్లిం ఐకాస నిరసన

ఇచ్చోడ, న్యూస్‌టుడే : మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్వామిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఇచ్చోడలో ముస్లిం ఐకాస ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బంద్‌కు పిలుపునిచ్చారు. అనంతరం ఎస్సై తిరుపతికి ఐకాస నాయకులు వినతిపత్రం అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం ఐకాస నాయకులు

దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఈ నెల 13న సైద్‌పూర్ నుంచి భీంసరి గ్రామానికి వాహనాల్లో డీజే తీసుకెళుతున్న రాథోడ్ చరణ్‌సింగ్, రాథోడ్ రాజు, రాథోడ్ అశోక్‌లపై దాడి చేసిన వారిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ డివిజన్ తుడుందెబ్బ అధ్యక్షుడు జంగు పటేల్ మంగళవారం పాత్రికేయుల సమావేశంలో డిమాండ్ సైతం చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వాహనాల్లో డీజే తీసుకెళ్తుండగా రామాయి గ్రామం వద్ద రహదారిపై అడ్డుగా ఉన్న జిట్టె ప్రభాకర్, జిట్టె రత్నాకర్, శ్యాంబాయి, అనిల్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్, ఇస్తారి, దత్తుతో పాటు మరి కొందరు వాహన డ్రైవర్లపై దాడి చేసి గాయపర్చటంతో పాటు వాహనాలను ధ్వంసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామీణ పీఎస్‌లో దాడి కేసు నమోదు చేశామన్నారు. సైద్‌పూర్‌కు చెందిన రోహిదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మళ్లీ ఈ కేసును అట్రాసిటీగా మార్చి దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు.